క్లుప్తంగా

నేడు గురుపౌర్ణమి

ఓర్వకల్లు: మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడకలు భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయి. కాల్వబుగ్గ సమీపాన వెలసిన సాయిబాబ గుడిలో ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు స్వాముల వారికి శాంతిపూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిత్యాన్న దానం నిర్వహిస్తున్న శివసాయి గురూజీ తెలిపారు. చివరి రోజున ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వాముల వారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అదేవిధంగా సోమయాజులపల్లె సమీపాన వెలసిన సాయిబాబా దేవాలయంలో బాబాకు విశిష్ట పూజలు, భక్తులకు అన్నప్రసాదం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సన్మానం



తహసీల్దార్ అనుపమను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: ఎన్నికల విధులు నిర్వర్తించి తిరిగి సొంత జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ అనుపమను శనివారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, మండల గణాంకాధికారి ఆదినారాయణ, వీఆర్వోలు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

కొరటమద్ది వాసికి డాక్టరేట్



శేషాద్రిగౌడ్

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామానికి చెందిన ఆంజనేయులు, నాగేంద్రమ్మ కుమారుడు శంకర్‌గౌడ్‌కు యోగి వేమన విశ్వవిద్యాలయం శనివారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రిటైర్డ్ ప్రొఫెసర్ జి. గులామతారభ్ పర్యవేక్షణలో దయస్పోరిక్ విజన్ ఇన్ ద సెలెక్ట్ నావెల్స్ ఆఫ్ వీయఫ్ నైయ్‌పాల్ అనే అంశంపై శంకర్‌గౌడ్ పరిశోధన చేసి డాక్టరేట్ పొందాడు. ఈయన ప్రస్తుతం ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సహ ఆచార్యునిగా ఆంగ్ల శాఖలో పనిచేస్తున్నాడు.

రసాయన ఎరువులతో ముప్పు



గుడిపాడు రైతులతో బీటీ రామానాయుడు

గూడూరు రూరల్: రసాయన ఎరువులు అధికంగా వాడడం మూలంగా మానవ, జంతువాళికి ముప్పు ఏర్పడుతుందని నవ భారత్ ఫర్టిలైజర్స్ ఎల్ఎల్‌పీ ఫీల్డ్ ఆఫీసర్ బీటీ రామానాయుడు పేర్కొన్నారు. గుడిపాడు, చనుగొండ్ల, వై.ఖానాపురం, గూడూరులో శనివారం ఆయన పర్యటించారు. రసాయన ఎరువుల వాడకం మూలంగా కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించి మంచి దిగుబడులు సాధించాలని ఈ సందర్భంగా బీటీ రామనాయుడు రైతులకు సూచించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ శకుంతల, డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి

సి.బెళగల్: ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. శనివారం ఆమె స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి, ఆయుష్ డాక్టర్ ప్రసాదరెడ్డి, సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి,సీనియర్ అసిస్టెంట్ సుధకర్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయన్నారు.

శుభ్రతపై అవగాహన కల్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: విద్యార్థులు పరిసరాల శుభ్రత, వ్యాధుల వ్యాప్తిపై తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని కొండాపురం ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రత, ఆరోగ్య అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. సీజన్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, జబ్బుల నివారణ పద్ధతులను విద్యార్థులకు వివరించారు.

చెరువులు ఇలా... సాగు ఎలా?

- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- కట్టలపై ఏపుగా పెరిగిన కంపచెట్లు
- లీకేజీతో పొలాలు నీటిపాలు
- పూడికతో చెరువుల్లో తగ్గుతున్న నీటినిల్వ సామర్థ్యం

పాణ్యం: చెరువులు అస్తవ్యస్థంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువు కట్టలపై కంపచెట్లు ఏపుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో పాణ్యం మండలంలోని ఆరు చెరువులు ఉన్నాయి. పాణ్యం ఊరుముందరి చెరువు, వడ్డుగండ్ల, కొండజుటూరు, ఆలమూరు, భూపనపాడు, కొలమాకుల రిజర్వాయర్ కింద 1,485 ఎకరాల్లో సాగుభూమి ఉంది. దాదాపు అన్ని చెరువులు అస్తవ్యస్థంగా మారాయి. తూములు ఏ మాత్రం పనిచేయడం లేదు. పంట కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చెరువుల్లోనూ పూడికి పెరిగిపోయినట్లు రైతులు చెబుతున్నారు. నీటి సామర్థం కూడా పూర్తిగా తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూపనపాడు చెరవు కట్టపై విపరీతమైన కంపచెట్లు పెరిగిపోయాయి. బండ్‌నే ప్రమాదకరంగా మారెలా మారింది పరిస్థితి. చెరువులో సైతం కంపచెట్లు ఏపుగా పెరిగాయి. కనీస మరమ్మతులు చేపట్టడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అడవిని తలపిస్తున్న భూపనపాడు చెరువు



చెరువు నుంచి లీకేజీ అవుతున్న నీరు

నిత్యం నీటితో బీళ్లుగా మారిన పొలాలు

ప్రత్యేకించి పాణ్యం ఊరుముందర చెరువు మరీ అధ్వానంగా మారింది. ఈ చెరువు కింద అధికారుల లెక్కల ప్రకారం 327.75 ఎకరాలు సాగువతుంది. చెరువుకు గుండం వద్ద ఉన్న తూము పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. లీకేజీలు అధికంగా ఉన్నాయి. అలుగు లీకెజీ కారణంగా నీరు పెద్ద వాగును తలపించేలా నిత్యం పొలాలోకి పారుతుంది. దీంతో సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. వంద ఎకరాలకుపైగా బీళ్లుగా మారాయి. ప్రస్తుతం పొలాల్లో ఏపుగా కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రైతులు తమ పోలాను కూడా గుర్తించలేనంత బీళ్లుగా మారాయి. దీంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పని చేయని పాణ్యం చెరువు గుండం వద్ద ఉన్న తూమ్

మండలంలోని చెరువుల వివవాలు

చెరువు పేరు	నీటినిల్వ ఎంసీఎఫ్‌టీ	ఆయకట్టు	విస్తీర్ణం ఎస్క్యూ కిలోమీటరు	ఎత్తు మీటర్లు
ఊరుముందరి చెరువు	22.95	327.75	0.4246	4.76
వడ్డుగండ్ల	45.91	127	0.1867	4.56
ఆలమూరు	74.87	172.59	0.240	4.25
భూపనపాడు	32.70	450	0.781	4.4
కొలమాకుల రిజర్వాయర్	84.76	200	0.712	9.5



పాణ్యం చెరువు దుస్థితి...



పాణ్యం చెరువు కింద బీళ్లుగా మారిన వ్యవసాయ పొలాలు

సాగు పొలాలు బీడుగా మారాయి



పాణ్యం చెరువు కింద మా కుటుంబ సభ్యులకు దాదపు నాలుగు ఎకాలు ఉంది. చెరువు లీకెజీ, అలుగునీరు పెద్ద ఎత్తున పొలాలపై ప్రవహించడంతో సాగు చేయడమే మానేశారు. సాగు చేయకపోవడంతో బీళ్లుగా మారాయి. పొలం హద్దులు గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ఇలా దాదాపుగా వందల ఎకరాలు అడవిని తలపిస్తున్నాయి. అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

–రాజాభాయ్‌గారి అజ్మతుల్లా

నీటి లీకేజీని అరికట్టాలి

పాణ్యం చెరువు లీకెజీని అరికట్టాలి. ప్రతి ఏటా దిగువన ఉన్న రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలుగు నుంచి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుని గుండం వద్ద ఉన్న తూమ్‌లకు మరమ్మత్తులు చేపట్టాలి. లీకేజీలను అరికడితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కంబాల సురేష్

ప్రతిపాదనలు పంపాం

చెరువుల సమస్యలను గుర్తించి నిధుల మంజురుకు ప్రతిపానదలు పంపాం. క్షేత్ర స్థాయిలో పర్యటించి, రైతలు అభిప్రాయాలతో ప్రతిపాదనలు రూపొందించాం. పాణ్యం చెరువు మరమ్మతులు, ఇతర నిర్వహణకు రూ. 11లక్షలు, వడ్డుగండ్ల చెరువుకు రూ. 5.50లక్షలు, కొండజుటూరు చెరువుకు రూ. 2.80లక్షలు, ఆలమూరు చెరువుకు రూ. 2.80లక్షలు, భూపనపాడు చెరువుకు రూ. 2.50లక్షలతో ప్రతిపాదలు తయారు చేసి పంపాం.

– అర్జున్‌సింగ్ మైనర్ ఇరిగేషన్, ఏఈ

తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

గూడూరు రూరల్: వర్షాలు పడుతున్నందున గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు తాగునీరు, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ విజయసింహారెడ్డి సూచించారు. మండల పరిధిలోని మునగాలలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తాగునీటి ట్యాంకలను క్రమం తప్పకుండా శుభ్ర చేయించి ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తత ంగా ఉండాలని, వ్యక్తిగతంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమ ంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సనచౌదరి, సర్పంచ్ గోపాల్,పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి తదితరలు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయసింహారెడ్డి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కల్లూరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని పెద్దటేకూరు, దొడ్డిపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. కాలువలు, ట్యాంకుల శుభ్రత తదితర పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందజేస్తున్న సంపూర్ణ పోషణను పరిశీలించి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం తడకనపల్లె గ్రామంలో సీతాఫలం, కుంకుడుకాయ విత్తనాలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దేశ్వరమ్మ, సర్పంచ్ సహేరబీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రం ఎదుట బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

సి.బెళగల్: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందిని ఎంపీడీఓ శకుంతల ఆదేశించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో శనివారం ఎంపీడీఓ పర్యటించారు. సర్పంచ్ పాండురంగన్న చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రధాన వీధులలోని మురుగు కాలువలను, తాగునీటి వనరులను పరిశీలించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయం – 1లో సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బందితో ఎంపీడీఓ సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధుల కట్టడికి చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తాం

ఓర్వకల్లు: మండల అభివృద్ధికి తమవంతు సహకారం కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'ప్లాంట్ ఏ ట్రీ చాలెంజ్' కార్యక్రమంలో భాగంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఏపీడీ లక్ష్మన్నతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాలంలో మండల వ్యాప్తంగా పదివేల మొక్కలు నాటాలన్నదే లక్ష్యం అన్నారు. ప్రతిఒక్కరూ కనీసం ఓ మొక్క నాటడడంతోపాటు బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. గుట్టపాడు వద్ద జైరాజ్ ఇస్పాత్ వారు స్థాపిస్తున్న స్టీల్ ప్లాంట్ పరిశ్రమను వంద రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయమైన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. తదనంతరం కన్నమడకల గ్రామానికి చెందిన బాలుడు సాగర్ అస్వస్థకు గురై మృతి చెందడంతో మృతుని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, మద్దికుంట రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: తుంగభద్ర నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని నదీతీర గ్రామాలైన ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లో పర్యటించారు. గుండ్రేవుల పుష్కరఘాట్ దగ్గర తుంగభద్ర నదిలో నీటి ప్రవాహ స్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. హోస్పేట్‌లోని తుంగభద్ర నదిపై ఉన్న డ్యామ్‌కు ఎగువ ప్రాంతాలను పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో చేరుతుందన్నారు. డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు వరద నీటిని ఏక్షణమైన వదిలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా రైతులు వ్యవసాయ మోటార్లను, పైపు లైన్లను మార్చుకునే ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



గుండ్రేవులలో తుంగభద్ర నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి

- ఆర్‌డీఓ శేషిరెడ్డి

గూడూరు రూరల్: ప్రతిఒక్కరూ వక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఆర్డీఓ శేషిరెడ్డి సూచించారు. మండల కేంద్రం గూడూరులో శనివారం ఆర్డీఓ శేషిరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ముందుగా బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్‌లో కలియతిరిగారు. అదేవిధంగా పరిసరాలను పరిశీలించారు. వార్డెన్ మాధవేణితో మాట్లాడిన ఆర్డీఓ విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. తాగునీటి సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. సీజన్ వ్యాధులు సోకకుండా విద్యార్థినులు ఆరోగ్య సూత్రాలు పాటించేలా చైతన్యపరచాలని సూచించారు. అనంతరం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆర్డీఓ తనిఖీ చేశారు. తరగతి గదులు, టాయిలెట్లు, మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాని, వంటల తయారీలో శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. నాడు–నేడు కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి విదత్యార్థులకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఈ సందర్భంగా ఆర్డీఓ ప్రధానోపాధ్యాయులకు సూచంచారు. తదనంతరం తాగునీటి ట్యాంకులను ఆర్డీఓ పరిశీలించారు. క్లోరినేషన్ చేసి ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీధులు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ అధికారులను హెచ్చరించారు. ఆయన వెంట కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ నరసింహులు, ఎంఈఓ సునీలమ్మ ఉన్నారు.



ప్రాథమికి పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మట్లాడుతున్న ఆర్‌డీఓ శేషిరెడ్డి

కోడుమూరులో 38.6మిమీ వర్షం



కోడుమూరులోని మెయిన్ బజార్‌లో భారీగా పారుతున్న వర్షపునీరు

కోడుమూరు రూరల్: అల్పపీడన ప్రభావంతో కోడుమూరు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం తెలవారుజామున వరకు విడతలువిడతలుగా వర్షం కురియడంతో కోడుమూరులోని చాలావీధులు జలమయం అయ్యాయి. పంటపొలాలు నీట మునిగాయి. వాగెలెచ వం పొంగి పొర్లాయి. నెలరోజుల తర్వాత మండలంలో 38.6మీ.మీల వర్షం కురియడంతో కొర్ర, సజ్జ, కంది, పత్తి, ఆముదం వంటి పంటలకు ఊపిరి అందిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కలూరులో 18 మిమీ...

కల్లూరు : అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా కల్లూరు మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 18 మీ. మీ వర్షపాతం నమోదైనట్లు ఏఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. సుమారు 25 రోజుల తరువాత వర్షం కురవడంతో పత్తి, మొక్కజొన్న, కంది పంటలకు అనుకూలమని రైతులు చెప్పారు.



గడివేముల జెడ్పీ స్కూల్ ప్రధాన ముఖద్వారం సమీపంలో ఏర్పాటు చేసిన షెడ్లు

ప్రభుత్వ స్థలాల్లో రేకుల షెడ్లు!

గడివేముల: ప్రభుత్వ స్థలాల్లో ఇష్టానుసారంగా బంకులు, పెద్దపెద్ద రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ వెంట పదికి పైగా రేకుల షెడ్లు వెలిశాయి. నంద్యాల, నందికొట్కూరు ప్రధాన రహదారిలో అక్రమంగా వెలసిన సెడ్లలతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిలోనే జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల, జెడ్పీ హైస్కూల్ ఉన్నాయి. షెడ్ల నుంచి వచ్చే శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు స్కూలు ప్రహరీ వెంట వెలసిన దుకాణాలను తొలగించాలని పలువురు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. దీంతో ఇష్టారాజ్యంగా బంకులు వెలుస్తూనే ఉన్నాయి. మరికొందరు అక్రమార్కులు తమ సొంత స్థలం అన్నట్లుగా పెద్ద రేకుల షెడ్లు నిర్మించి ఇతర వ్యాపారాలకు అద్దెలకు ఇస్తున్నారు. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులకు పలువురు ఫిర్యాదు చేయగా నామమాత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. అదేవిధంగా దుకాణాల్లోని వ్యర్థాలను సైతం పాఠశాల క్రీడామైదానంలో పడేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. నివాస గృహాలకు, నూతన గృహాలకు కరెంట్ మీటర్ కనెక్షన్ కావాలంటే వంద నిబంధనలు పెట్టే విద్యుత్ శాఖ అధికారులు వీరికి మాత్రమే వెంటనే ఇచ్చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు: బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చిన్నటేకూరు బ్రాంచ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ హనుమంతయ్య, అసిస్టెంట్ మేనేజర్ శ్రావణి, సిబ్బంది తడకనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సహేరా బీ, మహిళా గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు జుబేదా బేగం, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.